సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



గిట్టుబాటు కరువై.. సాగు భారమై!

జిల్లాలో రెండేళ్లుగా మార్కెట్‌లో అల్ల నేరేడుకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. నష్టాలు భరించలేక అల్లనేరేడు చెట్లను రైతులు నరికి వేస్తున్నారు. -8లో



కూలిన వంతెన

కడప- బద్వేలు మార్గంలోని అటవీ ప్రాంతంలో సాహెబ్ బావి రహదారికి సమీపంలో కిటికీల వంతెన శనివారం కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.540
రెండోరకం	రూ.300	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పింఛా ప్రాజెక్టుకు వరదనీరు



పింఛా ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు

సుండుపల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో పింఛా ప్రాజెక్టులోకి వరదనీరు చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం వెయ్యి అడుగులు ఉండగా శనివారం ఉదయానికి 993.90 అడుగులు నీటి నిల్వ ఉందని జలవనరుల శాఖ ఏఈఈ నాగేంద్రనాయక్ తెలిపారు. ఎడమ కాలువ ద్వారా ఒక క్యూసెక్కు, కుడికాలువ ద్వారా 6 క్యూసెక్కుల నీరు వ్యవసాయ పొలాలకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ

కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్ వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జెడ్పీ సీఈఓ, రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ తెలిపారు. శనివారం కలెక్టరేట్లో ప్రిసైడింగ్ అధికారులకు, ఏపీఓలకు బ్యాలెట్ బాక్స్ ల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ వి.విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.


నూలివీడులో వెలుగుచూసిన శాసనం



కడప సెవెన్‌రోడ్స్: గాలివీడు మండలం నూలివీడులో అరుదైన శాసనం వెలుగు చూసినట్లు ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ (ఎపిగ్రఫీ) మునిరత్నంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక పాఠశాల ఉపాధ్యాయుని సమాచారం మేరకు నూలివీడు గ్రామ సమీపాన ఉన్న ఓ పెద్ద రాతి గుండుకు ఈ శాసనం మలిచారని తెలిపారు. విజయనగర కాలం నాటి శాసనంగా గుర్తించామని పేర్కొన్నారు. శాసనాలలో ఉన్న చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వివరించారు.

నేటితో ప్రచారానికి తెర

- ఎక్కడికి అక్కడ ప్రలోభాలకు తెర లేపుతున్న టీడీపీ
- అధికారంలో ఉండి ఓడిపోతే పరువు పోతుందన్న ఆందోళనలో కూటమి





సాక్షి రాయచోటి: వైఎస్సార్‌జిల్లాలో జరుగుతున్న పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఆదివారంతో ప్రచారానికి తెరపడనుంది. ఇప్పటికే అభ్యర్థులతోపాటు మద్దతుదారుల ప్రచారంతో పల్లె ప్రాంతాలు హోరెత్తాయి. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ప్రధాన నాయకులు రంగంలో దిగి జోరుగా ప్రచారం నిర్వహించారు. మరోవైపు టీడీపీ ప్రచారం చేస్తూనే..ఇంకోవైపు దౌర్జన్యాలు, దాడులతో బెంబేలెత్తించారు. ఏదో ఒక రకంగా వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకోవడంతోపాటు భయపెట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే పోలింగ్ బూత్‌ల విషయంలో పచ్చరాజకీయం తెరమీదికి రావడం, స్థానికంగా ఉన్నవారు మరో బూత్‌లోకి వెళ్లి ఓటు వేసే కొత్త సంప్రదాయానికి తెరతీయడంపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. సార్వత్రిక ఎన్నికలు కాకపోయినా కేవలం జెడ్పీటీసీ స్థానాల విషయంలోనే కూటమి సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అనైతిక చర్యలకు పాల్పడుతోంది.

- జిల్లాలోని పులివెందులతోపాటు ఒంటిమిట్టలోనూ గెలువడం కష్టమని భావించి నేతలు ప్రలోభానికి తెర తీస్తున్నారు. కొన్నిచోట్ల గుంపగుత్తగా ఓట్లను కొనేందుకు కూడా సిద్ధమవుతున్నారు. భయపెట్టడం, బెదిరించడం, అవసరాన్ని బట్టి ఆర్థికంగా ఆశలు చూపి స్థానిక ప్రజలతోపాటు నాయకులను తమవైపు తిప్పుకోవడం, ఇతర అనేక హామీలతో ఎన్నికల ఎత్తుగడలతో ముందుకు వెళుతున్నారు. ఒంటిమిట్టతోపాటు పులివెందులలోనూ ఇప్పటికే ప్రచారంతోపాటు అవసరానికి మించి డబ్బులు ఖర్చు చేసిన కూటమి నేతలు రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ ఎత్తున నగదు పంపిణీకి సిద్ధమవుతున్నారు. ముఖ్య నేతల ఆదేశాలతో కిందిస్థాయిలో ఓటర్లను ఏదో ఒకరకంగా తమవైపు తిప్పుకునేందుకు అగచాట్లు పడుతున్నారు. ఒంటిమిట్టలో ఏకంగా మంత్రులు మకాం వేసి పన్నాగం నడిపిస్తుండగా, పులివెందులలోనూ శనివారం మంత్రులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతల ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజున పోలీసులపై కూడా పెద్ద స్థాయిలో ఒత్తిడి తీసుకు వచ్చి టీడీపీ ఆటలు సాగేలా కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ నేతలను ఇబ్బందులకు గురి చేయడంపై ప్రజాస్వామ్యవాదులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పరువుకోసం పాకులాట



జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ స్థానాలు ఎన్నో ఏళ్ల చరిత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటూ వస్తోంది. ఈసారి కూడా బలమైన అభ్యర్థులే బరిలో నిలవడంతోపాటు మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో గెలుపుపై పూర్తి ధీమాగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉన్నాయి. ఒంటిమిట్టలోనూ ఇదే పరిస్థితి శ్రేణుల్లో కనిపిస్తోంది. అయితే అధికారంలో ఉన్న టీడీపీ ఓడిపోతే ఉన్న పరువు పోతుందని కూటమి శ్రేణులు ఎంతకైనా తెగించేందుకు సిద్ధమవుతున్నాయి.

- ఒంటిమిట్టతోపాటు పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆదివారంతో ప్రచారానికి తెర పడనుంది. జులై 30 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం కల్పించగా, పులివెందులలో 11, ఒంటిమిట్టలో 11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇప్పటివరకు వైఎస్సార్ సీపీ నేతలు అన్ని గ్రామాల్లోనూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఏది ఏమైనా వైఎస్సార్ సీపీ గెలుపుపై ధీమాతో ఉండగా, టీడీపీ నేతలు నిరాశ నిస్పృహాలతో కనిపిస్తుండం గమనార్హం.



ఓటును అభ్యర్థిస్తున్న, వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, కడప పార్లమెంట్ పరిశీలకులు అజయ్ రెడ్డి



ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి

ఎన్ని కుట్రలు చేసినా
గెలుపు వైఎస్సార్‌సీపీదే

వైఎస్సార్‌సీపీ కీలక నేతలు



ప్రచారం నిర్వహిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఒంటిమిట్ట: తెలుగుదేశం పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని కుట్రలు చేసినా ఈ నెల 12న జరగబోయే జెడ్పీటీసీ ఉప ఎన్నికలో విజయం సాధించేది వైఎస్సార్‌సీపీయేనని వైఎస్సార్‌సీపీ కీలక నేతలు ధీమా వ్యక్తం చేశారు. .శనివారం మండల పరిధిలోని మంటపంపల్లి, రామచంద్రాపురం, అచ్చంపేట, ఎస్టీ కాలనీ, పెన్నపేరూరు గ్రామాల్లో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కడప పార్లమెంట్ పరిశీలకులు అజయ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు.ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

- రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ..ఒంటిమిట్ట, పులివెందుల అభ్యర్థులను గెలిపించి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా అందిస్తామన్నారు.
- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు సాధ్యం కాని హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేయడమే అని అన్నారు.
- వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ..పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికను ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే తీసుకొచ్చారని, కేవలం 8 నెలలు ఉన్న ఈ పదవికి ప్రభుత్వం ఇన్ని కోట్లు ఖర్చు చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో తెలియడం లేదన్నారు.
- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ..ఓటర్లను, నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఉప ఎన్నికలో కూటమి ప్రభుత్వం గెలిచేందుకు సిద్ధమవుతోందని తెలిపారు.
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ..ముస్లిం, మైనారిటీలకు మేలు చేసింది ఎవరంటే దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్ అన్నారు. ఇంతటి మేలు చేసిన వారికి మద్దతుగా జెడ్పీటీసీ ఉప ఎన్నికలో సుబ్బారెడ్డి ని గెలిపించాలని కోరారు.
- రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..కుప్పంలో గత జెడ్పీటీసీ ఎన్నికల్లో వంద శాతం వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడంతో సీఎం చంద్రబాబు అవమానాన్ని భరించలేక వైఎస్ జగన్ ఇలాక అయిన కడప జిల్లాలో వైఎస్సార్‌సీపీని ఓడించి జగన్‌ను అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతో ఉప ఎన్నికను నిర్వహిస్తున్నారన్నారు.
- మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు మహిళలను నిలువునా మోసం చేశారన్నారు. తాను అధికారంలోకి వస్తే ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి వంటి పథకాలను అమలు చేస్తానని చెప్పారని, ఇప్పటిదాకా వాటి గురించి పట్టించుకోలేదన్నారు.
- కడప పార్లమెంట్ పరిశీలకులు అజయ్ రెడ్డి మాట్లాడుతూ..టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా జెడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీని గెలుస్తుందని తెలిపారు. నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, మేడా మధుసూదన్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, రాష్ట్ర కడప అధికార ప్రతినిధి జైచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరామ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు జంగంరెడ్డి కిశోర్ దాస్, స్థానిక నాయకులు మంటపంపల్లి సర్పంచ్ బాదుల్లా, మల్లిరెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి, మనోహర్ రెడ్డి, పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంటపంపల్లిలో రవీంద్రనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అంజద్ బాషా, రమేష్ కుమార్ రెడ్డి, అజయ్ రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ప్రచారం

పదవులు ఎప్పుడిస్తారు.. బాబూ!

- తంబళ్లపల్లె, మదనపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో తమ్ముళ్ల ఎదురుచూపు
- భర్తీ చేయని సింగిల్‌విండో త్రీమెన్ కమిటీలు
- జోన్-4 ఇన్‌చార్జితో చెప్పుకున్నా కుదరని సయోధ్య



మదనపల్లె డివిజనల్ సహకార శాఖ కార్యాలయం

మదనపల్లె: పొరుగు నియోజకవర్గాల్లో తమ్ముళ్లు అధికారిక పదవులతో దర్జాగా తిరుగుతుంటే..పదవుల వడ్డింపు మాకెప్పుడంటూ తంబళ్లపల్లె, మదనపల్లె, రాజంపేట నియోజకవర్గాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా ఇంకా తమవరకు పదవులు దరిచేరకపోవడంపై నియోజకవర్గ నేతలు, పార్టీ అధిష్టానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లోని టీడీపీలో నెలకొన్న వర్గపోరు, స్థానిక నేతలపై అసంతృప్తి కారణంగా పదవుల భర్తీకి అధిష్టానం మొగ్గు చూపడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా సింగిల్‌విండో మండల స్థాయి కమిటీల ఏర్పాటు, ఆ పదవులను ఆశిస్తున్న స్థానిక నాయకులు దీనిపై ఆశలు పెట్టుకున్నారు. మిగతా నియోజకవర్గాల్లో సింగిల్‌విండో త్రీమెన్ కమిటీలను భర్తీ చేస్తూ అందులో ఒకరిని చైర్మన్‌గా ఇద్దరిని సభ్యులుగా నియమిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జీలు లేక ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తోంది. అయితే తంబళ్లపల్లె, మదనపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో త్రీమెన్ కమిటీల ఏర్పాటు పూర్తిగా ఆపేశారు. ఒక్కో మండలంలో ముగ్గురు టీడీపీ నేతలకు పదవుల ఆవకాశం వస్తుంది. దీనికోసం పదవులు ఆశిస్తున్న స్థానిక నాయకులు నియోజకవర్గ నేతలు, ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తంబళ్లపల్లెలో ఓడిపోయిన అభ్యర్థి జయచంద్రారెడ్డి ఉండగా మదనపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్ ఉన్నారు. రాజంపేటలో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆ పార్టీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో అక్కడ ఇన్‌చార్జి లేకపోగా ఇప్పటికీ ఎవరికి పార్టీ బాధ్యతలను అధిష్టానం అప్పగించలేదు. రాజంపేటలో ప్రస్తుతం టీడీపీకి నాయకత్వలోపం ఉంది.

వ్యతిరేకత..తమ్ముళ్లపై ప్రభావం

నియోజకవర్గాల్లో టీడీపీ నేతలపై నెలకొన్న వ్యతిరేకత, వర్గపోరు వల్ల తమ్ముళ్లకు పదవులు దక్కుండా పోతున్నాయి. తంబళ్లపల్లెలో జయచంద్రారెడ్డిపై సీనియర్లు, పార్టీ శ్రేణుల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. బహిరంగంగా, సోషల్‌మీడియాలోనే కాక, ఈ మధ్య పార్టీ కేంద్రకార్యాలయంలో జరిగిన ముఖ్యుల సమావేశంలో జయచంద్రారెడ్డి సమక్షంలోనే వ్యతిరేకత వ్యక్తం చేశారు. అంతకుముందు హార్సిలీహిల్స్‌పై జరిగిన సమావేశంలో మంత్రి జనార్దన్‌రెడ్డి, జోన్-4 ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి సమక్షంలో జయచంద్రారెడ్డి, వ్యతిరేక వర్గం మధ్య ముష్టిఘాతాలు, బాహాబాహికి తలపడ్డారు. దీంతో సమావేశం అర్థంతరంగా ముగిసింది. జయచంద్రారెడ్డిని మార్చాలన్న ప్రతిపాదన, డిమాండ్ ఉన్నప్పటికీ ప్రత్యామ్నయ నేత లేకపోవడంతో అధిష్టానం నిశ్శబ్దంగా ఉంది. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల తమ్ముళ్లకు పదవులు ఎండమావిగా మారింది. మదనపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్ కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి రావడంతో ఆయన్ను పార్టీ సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారు. దీంతో నియోజకవర్గం విషయంలో అధిష్టానం పెద్దగా ఆలోచించడం లేదని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే అభివృద్ధి పనులకు అనుమతులు కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఫలితంగా సింగిల్‌విండో పదవులపై ఆశలు పెట్టుకున్న నిమ్మనపల్లె, మదనపల్లె రూరల్, రామసముద్రం మండలాలకు చెందిన టీడీపీ తమ్ముళ్లు తమకు పదవులు ఎప్పుడిస్తారని ఎదురుచూస్తున్నారు. రాజంపేట నియోజకవర్గంలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇన్‌చార్జి ఎవరో తేలకపోవడం, ఆ బాధ్యతను ఆశిస్తున్న నేతలు ఒకరికి మించి ఉండటంతో అక్కడ వర్గపోరు తీవ్రంగానే ఉంది. ఈ పరిస్థితి వల్ల తమకు సింగిల్‌విండో పదవులు దక్కడం లేదంటూ తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలోని మన్నూరు, నందలూరు, పెద్దివీడు,వీరబల్లి, మట్లి, సుండుపల్లె, తిమ్మసముద్రం, చిన్నఓరంపాడు సింగిల్‌విండోలకు త్రీమెన్ కమిటీల నియామకం ఇంతవరకు జరగకుండా పెండింగ్‌లో ఉన్నాయి. దీనితో అధిష్ఠానం పదవులను ఇచ్చేందుకు ఎప్పుడు కరుణిస్తుందా అని తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు.

తెగిన పోగులు.. మారని బతుకులు

- పట్టుచీరలకు మద్దతు ధర కరువు
- ఉచిత విద్యుత్ హామీలోనూ కోతలే
- ఆదుకోని కూటమి సర్కారు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్ననేస్తంతో ఊరట



పవర్‌లూమ్ వద్ద చీర నేస్తున్న చేనేత కార్మికుడు



మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న నేతన్నల సమస్యలు గాలికి వదిలేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. తొమ్మిది నెలల క్రితం జీఓ జారీ చేసి ఏడాది తరువాత ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నట్లు ప్రకటించారు. అది కూడా పలు కొర్రీలు పెట్టారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఈ పథకంకు దూరంకానున్నారు. దీనిపై నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి సర్కారు చిన్నచూపు

కూటమి సర్కారు చేనేతలను చిన్నచూపు చేస్తోంది. కార్మికులను ఎంతగానో ఆదుకున్న నేతన్న నేస్తం పథకానికి మంగళం పాడింది. ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో చేనేతలు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయారు. దీంతో చాలా మంది కార్మికులు రేషం, వార్పు ధరలు తగ్గే వరకు మగ్గాలు నిర్వహించకుండా ఆపేస్తున్నారు. మరికొందరు రేయింబవళ్లు మగ్గం నేస్తూ తక్కువ కూలీతో బతుకు వెళ్లదీస్తున్నారు. ఇంతటి దయనీయమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

కుదేలైన చేనేత రంగం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగం కుదేలైంది. పట్టుచీరల తయారీలో వినియోగించే ముడి పట్టుధర ఆకాశన్నంటుతోంది. గత ఏడాది అక్టోబర్‌లో కిలో రూ4,800 ఉండగా ప్రస్తుతం రూ.5,800 పలుకుతోంది. వార్పు ధరలు ఆరు నెలలుగా పెరుగుతుండటంతో తయారీదారులపై భారం పడుతోంది. ముడిపట్టు ధరకు అనుగుణంగా చీరల ధరలు పెరగకపోవడంతో తయారీదారులపై భారం పడుతోంది. జిల్లాలో చేనేతరంగంపై 18 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తుండగా సుమారు 35 వేల మంది కార్మికులు, అనుబంధరంగాల వారు ఆధారపడి జీవిస్తున్నారు. అందులో మదనపల్లె(నీరుగట్టువారిపల్లె)లో 12 వేల కుటుంబాలు ఉన్నాయి. అలాగే కలకడ, తంబళ్లపల్లె, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, కురబలకోట,బి.కొత్తకోట, పుల్లంపేట, చిన్నమండ్యం, గాలివీడు, సంబేపల్లి, రాజంపేట, వీరబల్లి మండలాల్లో చేనేత కుటుంబాలు ఉన్నాయి.

నేతన్న నేస్తంతో పరిస్థితి మెరుగ్గా

ముడిపట్టు ధరలు పెరగడం, తగ్గడం సహజంగా జరుగుతోంటుంది. ఈ ఒడిదుడుకులను తట్టుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ముడి పట్టురాయితీ ఒకేసారి బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆదుకునేవారు. ఇలా ఐదేళ్ల పాటు క్రమం తప్పకుండా సాయం అందించారు. కరోనా వంటి కష్టకాలంలో రెండు నెలలు ముందుగానే నేతన్న నేస్తం నిధులు కార్మికుల ఖాతాల్లో జమ చేశారు. ఫలితంగా చేనేత కార్మికులు ప్రభుత్వం అందించిన సాయంతో చేనేత మగ్గాలను ఆధునీకరించుకుని గతంలో కంటే మెరుగైన డిజైన్‌లను వేసుకుని ఎక్కువ లాభం సంపాదించి అభివృద్ధి చెందారు.



నేతన్నల డిమాండ్లు ఇవీ

- చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం అమలు చేయాలి.
- మగ్గం కలిగిన ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తింపజేయాలి.
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీఎస్టీ ఎత్తి వేయాలి.
- కాటన్, సిల్క్ జరీలపై 50 శాతం రాయితీ ఇవ్వాలి, చేనేత కార్మికులకు 45 సంవత్సరాలకే పింఛన్ మూంజూరు చేయాలి.
- చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సంఘాలను బలోపేతం చేయాలి.
- ఆత్మహత్మలు చేసుకున్న చేనేత కార్మికులకు రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.

వైఎస్సార్‌సీపీ పాలనలో నేతన్న నేస్తం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	నిధులు
2021	5837	రూ.14,00,88,000
2022	6118	రూ.14,68,32,000
2023	6937	రూ.16,64,88,000

హామీలు అమలు చేయాలి



చేనేతకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఎన్నికల్లో చేనేత రంగానికి ఇచ్చిన 25 హామీలు ఇప్పటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి. చేనేతలను అన్ని విధాల ఆదుకోవాలి.

–నిస్సార్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

అర్హులకు ఉచిత విద్యుత్ పథకం అందించాలి



కూటమి ప్రభుత్వం ప్రకటించిన ప్రతి చేనేత కుటుంబానికి ఉచిత విద్యుత్ పథకం అర్హులందరికి అందించాలి. మగ్గం ఉన్న వారితో పాటు చేనేత అనుబంధరంగాలైన వైడింగ్, రాట్నం చుట్టడం, రంగులు, అచ్చులు అద్దకం వంటిపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి కూడా ఈ పథక అమలయ్యేలా చూడాలి. లబ్ధిదారులను తగ్గించాలన్న సాకుతో కొర్రీలు పెడుతున్నారు.

–శీలం రమేష్, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు

సబ్సిడీ అందజేయాలి



మగ్గం కలిగిన ప్రతి కుటుంబానికి ఉచిత విద్యుత్ హామీ త్వరగా అమలు చేయాలి. ప్రస్తుతం చేనేత రంగం సంక్షోభంలో ఉంది. పట్టు పరిశ్రమలో వార్పు, జరీ కొనుగోలుకు సబ్సిడీ అందజేయాలి.

–బాలచంద్ర, చేనేత కార్మికుడు, నీరుగట్టువారిపల్లె. మదనపల్లె

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న శంకరయ్య

గాలివీడు : మండలంలోని కొర్లకుంట పంచాయతీ పెద్దరెడ్డివారిపల్లెకు చెందిన నిర్జీ శంకరయ్య (38) అనే వ్యక్తి అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. మృతుడు రజక వృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. వారిని పోషించడంలో అప్పులు ఎక్కువ చేశాడు. వాటిని తీర్చుకోలేక గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వివాహిత..


చిన్న రెడ్డెమ్మ మృతదేహం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని సూర్య నగర్‌లో నివాసముంటున్న విద్యుత్ శాఖ ఏఈ యోగానంద్ భార్య చిన్న రెడ్డెమ్మ (40) శనివారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. మానసిక స్థితి బాగాలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.


రెండు టిప్పర్లు ఢీ

బి.కొత్తకోట : మదనపల్లె వైపు నుంచి కదిరి వైపు వెళ్తున్న టిప్పర్‌ను మరో టిప్పర్ ఢీకొన్న ఘటన శనివారం రాత్రి మండలంలోని జాతీయ రహదారిపై పెద్దపల్లె వద్ద జరిగింది. వివరాలు ఇలా.. మదనపల్లె నుంచి రెండు టిప్పర్లు ఒకదాని వెంట ఒకటి వెళ్తున్నాయి. ముందు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ పెద్దపల్లె సమీపంలోకి రాగానే బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనురాగ్ యాదవ్ (50) టిప్పర్‌లోనే ఇరుక్కుపోవడంతో స్థానికులు బయటకు తీశారు. వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు బీహార్‌లోని భేటియా జిల్లా శ్యాంపూర్ గ్రామస్తుడు.

గిట్టుబాటు కరువై.. సాగు బరువై..!

- నష్టాలు భరించలేక అల్లనేరేడు తోటల్ని నరికేస్తున్న రైతులు
- ఈ సీజన్‌లో కిలో రూ. 30 నుంచి రూ.40 ధరలు
- జిల్లాలో రూ. 40.50 కోట్ల మేర రైతులకు నష్టం


గుర్రంకొండలో అల్లనేరేడు చెట్లను కోసేస్తున్న దృశ్యం



గుర్రంకొండ : జిల్లాలో రోజురోజుకు అల్లనేరేడు తోటలు అంతరించిపోతున్నాయి. గత రెండేళ్లుగా మార్కెట్‌లో అల్లనేరేడుకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ఈ సీజన్‌లో మార్కెట్‌లో కిలో రూ. 30 నుంచి రూ. 40 వరకు ధరలు పలకడం గమనార్హం. దీంతో ఈ ఏడాది జిల్లాలో అల్లనేరేడు రైతులు రూ. 40.50 కోట్ల మేరకు నష్టపోయారు. నష్టాలు భరించలేక జిల్లాలో పలు చోట్ల అల్లనేరేడు చెట్లను రైతులు నరికి వేస్తున్నారు.

జిల్లాలో 3240 హెక్టార్లలో పంటసాగు

జిల్లాలో అల్లనేరేడు తోటల పెంపకం 3240 హెక్టార్లలో రైతులు చేపట్టారు. ఎకరం అల్లనేరేడు తోటల పెంపకానికి రూ. లక్ష వరకు ఖర్చు వస్తుంది. మొక్కలు నాటడం దగ్గర నుంచి కాయలు కాసేంతవరకు ఆరు సంవత్సరాల పాటు ఏడాదికి రూ. 80 వేలు చొప్పున తోటల నిర్వహణ ఖర్చు వస్తుంది. ఎరువులు, పురుగు నివారణ మందులు, మొక్కలు ఏపుగా పెరిగేందుకు అవసరమైన కట్టెలు వంటివి ఆరేళ్లపాటు ఖర్చులు వస్తాయి. ఈ లెక్కన ఎకరం తోటకు కాయలు కాసేవరకు రైతుకు రూ. 5 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఆ తరువాత ప్రతి ఏడాది కాయలు కాసే పంట దిగుబడిని బట్టి ఆదాయం ఉంటుంది.

ఎకరాకు రూ. లక్ష ఆదాయం..

ఆరేళ్ల పాటు తోటల్ని కాపాడుకున్న తరువాత మార్కెట్‌లో మంచి ధరలు ఉంటే ఎకరానికి రూ. లక్ష ఆదాయం వస్తుంది. ఏడాదికి ఎకరం తోటలో సుమారు 800 కేజీల నుంచి టన్ను వరకు పంట దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలో ధర రూ. 100 పలికితే ఎకరానికి రూ. లక్ష వరకు ఆదాయం రైతుకు సమకూరుతుంది. గత కొన్నేళ్లుగా మార్కెట్‌లో కిలో ధరలు రూ. 100 తగ్గిన దాఖలాలు లేవు. దీంతో జిల్లాలో పలువురు రైతులు అల్లనేరేడు తోటల పెంపకంతో నిలకడైన ఆదాయం వస్తుందని భావించి ఎక్కువగా తోటల్ని సాగు చేశారు.

రెండేళ్లుగా మారిన లెక్కలు..

ఏం జరిగిందో తెలియదు కానీ గత రెండేళ్లుగా అల్లనేరేడు తోటల పెంపకం నష్టాలు తీసుకొచ్చింది. ఓ వైపు ఊజిదోమలతో పాటు ఇతర రోగాలు వ్యాపించడంతో మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించలేదు. ఈ ఏడాది మంచి సీజన్‌లో కిలో రూ. 30 నుంచి రూ. 40 లోపే మార్కెట్‌లో ధరలు పలికాయి. రోగాల కారణంగా కాయలు దెబ్బతినడంతో బయటి రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గిపోయింది. దీంతో బయటి రాష్ట్రాలకు మన జిల్లా నుంచి ఎగుమతులు చాలా వరకు తగ్గిపోయాయి. దీంతో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి సాగు చేసిన అల్లనేరేడుకు ఎకరానికి రూ. 30లోపే ఆదాయం వచ్చింది. దీంతో అటు వ్యాపారులు, ఇటు రైతుల అంచనాలు తప్పాయి. దీంతో ఈ ఏడాది అల్లనేరేడు సాగు చేసిన రైతులు రూ. 40.50 కోట్ల మేరకు నష్టపోయారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ముఖం చాటేస్తున్న వ్యాపారులు..

రెండేళ్ల క్రితం తోటల వద్దకే వచ్చి తోటల్ని ఏడాదికి ముందే కొనుగోలు చేసే వ్యాపారులు ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. రైతులు రెండు రకాలుగా తోటల్ని వ్యాపారులకు విక్రయిస్తుంటారు. కాయలు కాయక మునుపే ఎకరా తోటలకు ఒక రేటు నిర్ణయించి ముందుగానే కొనుగోలు చేస్తుంటారు. మరోవైపు రైతులే కాయలు కాసే వరకు వేచి ఉండి ఆ తరువాత వ్యాపారులకు పంటను విక్రయిస్తుంటారు. అయితే ఈ ఏడాది మార్కెట్‌లో ధరలు పుంజుకోక పోవడంతో వ్యాపారులు అల్లనేరేడు తోటలపై ఆసక్తి చూపించలేదు. రైతులు పలుమార్లు వ్యాపారుల్ని సంప్రదించినా ఫలితం కనిపించలేదు. మరోవైపు ఎంతో కొంత అడ్వాన్స్ చెల్లించిన వ్యాపారులు మాత్రం విధిలేని పరిస్థితిలో కాయల్ని కోసి మార్కెట్‌కు తరలించి ఎంతో కొంత సొమ్ము చేసుకున్నారు. అయితే రైతులకు మాత్రం నష్టాలు వచ్చియని చూపించి మిగిలిన సొమ్ము చెల్లించలేక ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వ్యాపారులు పంటకొనుగోలుకు అడ్వాన్స్‌లు చెల్లించినా ధరలు లేకపోవడంతో అటువైపు వెళ్లడం మానేశారు.

తోటల్లోనే వదిలేశాము



ఈ సంవత్సరం అల్లనేరేడు కాయల్ని కొనేవారు లేరు. వ్యాపారులు రెండేళ్ల క్రితం తోటలవద్దకే వచ్చి కొనుగోలు చేశారు. ఈ ఏడాది మేము బలవంతం చేసినా రాలేదు. కూలీల ఖర్చు భరించలేక, మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సరైన సౌకర్యాలు లేక కాయల్ని చెట్లలోనే వదిలేశాము. ఈ ఏడాది ఒక్క రూపాయి ఆదాయం కూడా రాకపోవడంతో నష్టపోయాం. – సుధాకర, అల్లనేరేడు రైతు, గుర్రంకొండ

చెట్లను కోసేస్తున్నారు



మా ప్రాంతంలో చాలా మంది రైతులు అల్లనేరేడు చెట్లను కోసేస్తున్నారు. మార్కెట్‌లో కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చాలా నష్టపోయాము. చేసేదిలేక కొంతమంది రైతులు తోటల్లోని చెట్లను వ్యాపారులకు ఉచితంగా ఇచ్చేసి కోసేస్తున్నారు. అల్లనేరేడుకు ఇలాంటి దుస్థితి ఎన్నడూ రాలేదు. – గయాజ్, అల్లనేరేడు రైతు, గుర్రంకొండ.

కాయలు కోయకుండా ..

మార్కెట్‌లో ధరలు పుంజుకోక.. కాయల కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపించకపోవడంతో చేసేదిలేక రైతులు కాయల్ని కోయకుండా తోటల్ని అలాగే వదిలేశారు. ఈ ఏడాది మామిడి తోటల్ని ఆవహించిన రోగాలన్నీ అనూహ్యంగా అల్లనేరేడు తోటలకు వ్యాపించడం గమనార్హం. మంచి సీజన్‌లో ఈ పరిస్థితి రావడంతో రైతులు ఆందోళన చెంది పురుగుల నివారణ మందులు కొనుగోలు చేసే పరిస్థితి లేక కొన్ని చోట్ల తోటల్ని వదిలేశారు. మరోవైపు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పాటు వ్యాపారులు రాకపోవడంతో పలువురు రైతులు కాయలు కోయకుండా తోటల్లో అలాగే వదిలేశారు.

తోటల్ని నరికేస్తూ ..

వరుసగా రెండేళ్ల పాటు అల్లనేరేడు తోటల పెంపకంతో నష్టాలు రావడంతో రైతులు భరించలేక చెట్లను నరికించి వేస్తున్నారు. పంటను వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో తాము సొంతంగా మార్కెట్‌లో విక్రయించుకోలేక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఒక కూలీకి ఒక రోజుకు అల్లనేరేడు కాయలు కోయడానికి రూ. 800 నుంచి రు. 1000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక కూలీ సరాసరి ఒక రోజుకు రెండు 25 కేజీల క్రీట్ల కాయల్ని కోయగలుగుతాడు. మార్కెట్‌లో కిలోధర రూ. 30 ఉంటే రెండు క్రీట్లు మార్కెట్‌కు తరలించినా రూ. 1500 రాబడి వస్తుంది. రవాణా ఖర్చులు, కమీషన్లు, కూలీ ఖర్చు లెక్కిస్తే రైతులకు మిగిలేది శూన్యం. దీంతో రైతులు నష్టాలు భరించలేక చెట్లనే కోసేస్తున్నారు. పలు గ్రామాల్లో వందల చెట్లు ఉన్న అల్లనేరేడు తోటలు మొత్తం కోసేశారు. కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా మామిడి తోటలు, ఇతర పొలాల వద్ద పెంచుకొన్న అల్లనేరేడు చెట్లను నరికి వేయించేస్తున్నారు. వ్యాపారులు చెట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించకపోవడంతో ఉచితంగా చెట్లను కోసుకెళ్లమని రైతులు అర్థిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రిషియన్‌కు తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన ఎలక్ట్రిషియన్ నాగరాజు

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రిషియన్ తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పుంగనూరుకు చెందిన ఎలక్ట్రిషియన్ నాగరాజు (25) మదనపల్లె మండలం గుడిసివారిపల్లెలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో మదనపల్లె బైపాస్‌రోడ్డు వెన్నెల రెస్టారెంట్ సమీపంలో ప్రైవేట్ డెయిరీకి చెందిన బొలేరో వాహనం ఇసుకనూతిపల్లె నుంచి బైపాస్ మెయిన్‌రోడ్డులోకి రాగా, వెంగమాంబ సర్కిల్ నుంచి పుంగనూరు వైపు వెళుతున్న నాగరాజు ఢీ కొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 వాహనం వచ్చేందుకు అరగంటకు పైగా సమయం పడుతుందని చెప్పడంతో ఢీకొన్న బొలేరో వాహనంలోనే నాగరాజును ఎక్కించుకుని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పిడుగుపాటుతో 47 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెల వద్ద విలపిస్తున్న బాధితులు

తంబళ్లపల్లె : పిడుగుపాటుతో 47 గొర్రెలు మృతి చెందిన విషాద సంఘటన శనివారం మండలంలో జరిగింది. మండలంలోని ఆర్‌ఎన్ తాండా పంచాయతీ బోనాసువారిపల్లెకు చెందిన రెడ్డమ్మ బంగారు తాకట్టు పెట్టి, పలువురు రైతుల వద్ద అప్పులు చేసి గొర్రెలు కొని వాటితో జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి గొర్రెలను షెడ్డులో తోలింది. వర్షం వల్ల పడిన పిడుగు తాకిడికి 47 గొర్రెలు మృతి చెందాయి. శనివారం ఉదయం గొర్రెలు బయట తోలేందుకు వెళ్లగా ఒక్కసారిగా గొర్రెలు మృతి చెందడం చూసి బోరున విలపిస్తూ కుప్పకూలింది. సమాచారం అందుకున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర, పశువైద్యులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి, ఇందులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. పిడుగుపాటుకే మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో ఆరు గొర్రెలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా చికిత్స చేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గ్రామానికి వెళ్లి బాధితులను ఓదార్చి పరామర్శించారు. రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చాడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, నాయకులు సురేంద్రనాథ్, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొండయ్య తదితరులు ఉన్నారు.

ఆగని మోటార్ల దొంగతనాలు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండలంలో మోటార్ల దొంగతనాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. శనివారం తెల్లవారుజామున మండలంలోని కోనంపేట గ్రామం కొండావాండ్లపల్లి సమీపంలోని కొండ ఓబుల్ రెడ్డి అనే రైతుకు చెందిన బావిలోని నీటిలో ఉండే మోటార్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. కొత్తమోటారు కొనాలంటే రూ. 20 వేలు పైబడి అవుతుందని, పంట సాగు చేసినా ఆదాయం రావడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.ఈ మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు. రెండేళ్లుగా మండలంలోని మద్దిరేవు, కస్తూరురాజుగారిపల్లి, చౌటపల్లి, దిన్నెపాడు, కోనంపేట, దప్పేపల్లి గ్రామాలలో ఏదో ఒక ప్రాంతంలో మోటార్ల దొంగతనాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతూనే ఉన్నారు.

ట్రాక్టర్ ఒరిగి ఇద్దరు కూలీలు దుర్మరణం


మృతిచెందిన మజీహిసింగ్, గలగసింగ్

చిన్నమండెం : ట్రాక్టర్ ఒరగడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కూలీలు దుర్మరణం చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మజీహిసింగ్(23), గలగసింగ్(20), లక్ష్మణ్‌సింగ్‌లు చిన్నమండెం-పెద్దమండ్యం జాతీయ రహదారిలో హైవోల్టేజీ విద్యుత్ లైన్ పనులు చేస్తున్నారు. పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో చిన్నమండెంకు వస్తుండగా పడమటికోన గ్రామం తొగటపల్లె సమీపంలో ట్రాక్టర్ పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో మజీహిసింగ్(23), గలగసింగ్(20) అక్కడికక్కడే మృతి చెందారు. లక్ష్మణ్ సింగ్‌కు గాయాలయ్యాయి. మృతదేహాలను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



సిద్దవటం : కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలం భాకరాపేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన పడిఉన్న గుర్తు తెలియని వృద్ధురాలిని కడప రిమ్స్‌లో చేర్పించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు ఒంటిమిట్ట సీఐ బాబు, 9121100581, సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ 9121100584 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రమాదంలో గాయపడి.. కోలుకోలేక..


శాంతమ్మ (ఫైల్)

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వివరాలు... స్థానిక మండల కేంద్రం ఇందిరా కాలనీకి చెందిన వెంకటరమణ, భార్య శాంతమ్మలు కలిసి గత గురువారం ద్విచక్రవాహనంలో పనుల మీద మదనపల్లెకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో వేపూరికోట వద్ద శాంతమ్మ చీర బైక్ చక్రానికి చుట్టుకొని కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడడంతో 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుకు బానిసలు కావద్దు


కార్మికులకు సూచనలు చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

రాయచోటి టౌన్ : మత్తుకు బానిసలై జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దని అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి జి. మధుసూదన్ అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని బంగ్లా సర్కిల్ వద్ద కార్మికులతో ఆయన మాట్లాడారు. రోజంతా కష్టపడి పని చేసి వచ్చిన డబ్బులను మద్యం, ఇతర మత్తు పదార్థాల కోసం ఖర్చు పెడితే ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోవడమే గాక జీవితం కూడా చిన్నాభిన్నమవుతుందన్నారు. మానవత సంస్థ సభ్యుడు సహదేవ రెడ్డి మాట్లాడుతూ మత్తుకు దూరంగా ఉండి మీ పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్, ఎస్ఐ ఓ. హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కడప- బద్వేలు మార్గంలో కూలిన వంతెన


అటవీ ప్రాంతంలో కూలిపోయిన కిటికీల వంతెన


అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్

సిద్దవటం : కడప- బద్వేలు మార్గంలోని అటవీ ప్రాంతంలో సాహెబ్ బావి రహదారికి సమీపంలో కిటికీల వంతెన శనివారం కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. ఈ రహదారి గుండా నెల్లూరు, బద్వేలు కలువాయి, పోరుమామిళ్ల తదితర ప్రాంతాలకు ప్రయాణికులు వెళుతుంటారు. 1983లో ఈ వంతెన నిర్మించారు. శనివారం అధిక లోడుతో వాహనాలు ప్రయాణించడంతో వంతెన కూలిపోయిందని ద్విచక్ర వాహనదారులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపి ప్రయాణికులు ఎవరినీ రోడ్డు దాటనీయకుండా చర్యలు చేపట్టారు. అధికారులు రెండు జేసీబీ యంత్రాలతో వంతెన పక్కనే అప్రోచ్ రోడ్డుకు చర్యలు చేపట్టారు. ఈ పనులను బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పరిశీలించారు. అనంతరం సాయంత్రానికి ఈ మార్గంలో వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

ప్రజలే నా బలం.. వైఎస్సార్‌సీపీ నా ఊపిరి



ప్రజలే నా బలం.. వైఎస్సార్‌సీపీ నా ఊపిరి అంటున్నారు ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయనతో జరిపిన ఇంటర్వ్యూ వివరాలు. – రాజంపేట

ప్రశ్న : మూడోసారి జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీకు ఈ ఎన్నికలు కలిసివస్తాయని భావిస్తున్నారా?

జవాబు : ఒంటిమిట్ట మండల ప్రజలు ఇరగంరెడ్డి కుటుంబానికి అండగా ఉంటూ వస్తున్నారు. రెండు సార్లు జెడ్పీటీసీ ఎన్నికల్లో ఆదరించారు. మూడోసారి ఆదరిస్తారనే ప్రగాఢ విశ్వాసం నాకు ఉంది.

ప్రశ్న : తటస్థ ఓటర్లు మీకు అండగా నిలుస్తారనుకుంటున్నారా?

జవాబు : ఈ ఎన్నికలో ప్రజలే నాకు బలం. వైఎస్సార్‌సీపీ నాకు ఊపిరి. దశాబ్ద కాలానికి పైగా మండలంలో ప్రజాసేవ చేస్తూ వస్తున్నా. రాజకీయాలకు నేను కొత్తకాదు. తటస్థ ఓటర్లు తప్పకుండా నావైపు మొగ్గు చూపుతారు.

ప్రశ్న : చంద్రబాబు పాలన ప్రభావం ఈ ఎన్నికల్లో ఉంటుందనుకుంటున్నారా?

జవాబు : కచ్చితంగా ఉంటుంది. చంద్రబాబు పాలనపై వ్యతిరేకత కనిపిస్తోంది. జెడ్పీటీసీ ఎన్నికల నుంచి వ్యతిరేక ఓటు బహిర్గతమవుతోంది. అదే రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కూడా కొనసాగుతుంది.

ప్రశ్న : టీడీపీ అధికారంలో ఉంది. ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేయడం సాహసించడమే కదా?

జవాబు : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి. అలాగే నాకు అండగా ఓటర్లు, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, స్కిల్‌డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ పెద్దల మద్దతు, సహకారం సంపూర్ణంగా ఉంది. టీడీపీ అధికారంలో ఉన్నా వారికి ఒరిగేది ఏమీ లేదు.

ప్రశ్న : ఒక జెడ్పీటీసీ స్థానం కోసం పదుల సంఖ్యలో క్యాబినెట్‌ను ఒంటిమిట్టకు రప్పించారు. అంత అవసరమా?

జవాబు : ఈ ఎన్నికలు చంద్రబాబును భయపెడుతున్నాయి. ఇక్కడ ఓడిపోతే తన పాలన ప్రజా వ్యతిరేక పాలన అనేది తేలిపోతుంది. అలా కాకుండా ఉండేందుకు చంద్రబాబు తన క్యాబినెట్‌ను ఒంటిమిట్టలో మకాం వేశారు. అప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచేందుకు అన్ని ప్రయోగాలు చేస్తున్నట్లుగా సమాచారం వస్తోంది. అన్నింటిని అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ క్యాడర్ సిద్ధంగా వుంది.

ప్రశ్న : ఈనెల 12న పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతుందనే నమ్మకం ఉందా?

జవాబు : పోలింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా నిర్వహిస్తుందని భావిస్తున్నాము. అధికారపార్టీ దౌర్జన్యాలు చేస్తే ఓటర్లు నిశితంగా గమనించి, తగిన రీతిలో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోలింగ్ జరగాలని వైఎస్సార్‌సీపీ కోరుకుంటోంది. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఆ దిశగా జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం దృష్టి సారించాలి.